నేడు ఎన్టీఆర్ భరోసా సామాజిక పింఛన్లు పంపిణీ

ప్రజాశక్తి - కడప

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఎ ప్రతిష్టాత్మకంగా అమలు పరుస్తున్న ఎన్టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ ఈనెల 31న పంపిణీ చేయనున్నట్లు కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరి మంగళ వారం ఒక ప్రకటనలో తెలిపారు. డిసెంబర్ నెలకు సంబంధించిన పింఛనులు ప్రభుత్వ ఆదేశాల మేరకు బుధవారం పెన్షన్లు పంపిణీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. 31న తీసుకోని వారికి జనవరి 2న అందజేస్తారని తెలిపారు. ఈనెలకు సంబంధించి 2,55,083 మంది పింఛనుదారులకు రూ.111.10 కోట్లు మంజూరు చేశారన్నారు. సచివాలయ పరిధిలోని క్లస్టర్ నివాసాలకు 31న ఉదయం 7.00 గంటల లోపు పింఛను పంపిణీ చేయాలన్నారు.

కడప, అన్నమయ్య జిల్లాల పునర్విభజన నోటిఫికేషన్ విడుదల

- జిఒ ఎంఎస్ 529 జారీ - నేటి నుంచి అమల్లోకి..

ప్రజాశక్తి - కడప ప్రతినిధి

జిల్లాల పునర్విభజన గెజిట్ నోటిఫికేషన్‌ను ప్రభుత్వం విడుదల చేసింది. కడప, అన్నమయ్య జిల్లా కలెక్టర్లకు రెవెన్యూ శాఖ పరిధిలోని ల్యాండ్స్-4 డిపార్టుమెంట్ మంగళవారం జిఒ ఎంఎస్ నెంబర్ 529 పేరిట ఆదేశాలు జారీ చేసింది. కడప జిల్లాలోని 36 మండలాలకు, పాత అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ పరిధిలోని ఆరు మండలాలను కలుపుతూ ఉత్తర్వుల్లో పేర్కొంది. కడప జిల్లా 40 మండలాల విస్తీర్ణంతో ఏర్పాటైంది. ఆంధ్రప్రదేశ్ జిల్లాల ఏర్పాటు యాక్ట్-1974 సబ్ సెక్షన్-1 కింద సెక్షన్-3, సబ్‌సెక్షన్ (2) పరిధిలోని సెక్షన్-3 ప్రకారం ఏర్పాటుకు కసరత్తు చేసినట్లు పేర్కొంది. 1974 యాక్ట్ నెంబర్-7 సబ్ సెక్షన్ (6)లో పేర్కొన్న విధంగా పాలనాసౌలభ్యం మేరకు ప్రతిపాదించినట్లు తెలిపింది. 2025 డిసెంబర్ 31 నుంచి కడప, అన్నమయ్య జిల్లాల సరిహద్దులు అమల్లోకి రానున్నట్లు ప్రస్తావించింది. కడప జిల్లా పరిధిలోని 40 మండలాలతో జాబితాను విడుదల చేసింది. బద్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలోని మైదుకూరు, కాశినాయన, కలసపాడు, పోరుమామిళ్ల, బి.కోడూరు, బద్వేల్, గోపవరం, బ్రహ్మంగా రిమఠం, అట్లూరు మండలాలు ఉంచింది. కడప రెవెన్యూ డివిజన్ పరిధిలోని కడప, కమలాపురం, వల్లూరు, చెన్నూరు, చింతకొమ్మదిన్నె, పెండ్లిమర్రి, ఒంటిమిట్ట, సిద్ధవటం, ఖాజీపేట మండలాలు ఉన్నట్లు తెలిపింది. జమ్మల మడుగు రెవెన్యూ డివిజన్ పరిధిలోని జమ్మల మడుగు, పెద్దము డియం, మైలవరం, ముద్దనూరు, కొండాపురం, ప్రొద్దుటూరు, రాజుపాలెం, ఎర్రగుంట్ల, దువ్వూరు, చాపాడు, సింహాద్రిపురం, లింగాల, తొండూరు, పులివెందుల, వేముల, వేంపల్లి, చక్రాయపేట మండలాలను ఉంచింది. పాత అన్నమయ్య జిల్లా రాజంపేట అసెంబ్లీ పరిధిలోని రాజంపేట, నందలూరు, వీరబల్లి, టి.సుండుపల్లి మండ లాలను కలుపుతూ సరిహద్దులను ఏర్పాటు చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. 2025 డిసెంబర్ 31 నుంచి అమల్లోకి రానున్నాయని స్పష్టంగా పేర్కొనడం గమనార్హం.



అంతర్రాష్ట్ర బ్యాగ్ లిఫ్టింగ్ ముఠా అరెస్టు

రూ.75 లక్షలు విలువ చేసే సొత్తు స్వాధీనం
ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్

ప్రజాశక్తి-కడప అర్బన్

అంతర్రాష్ట్ర బ్యాంగ్ లిఫ్టింగ్ ముఠాను జిల్లా పోలీసులు అరెస్టు చేశారు. భారీగా దొంగ సొత్తు స్వాధీనంతో పాటు 9 మంది అంతరాష్ట్ర దొంగలను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలోని పెన్నార్ కాన్ఫరెన్స్ హాల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్‌పి షెల్కే నచికేత్ విశ్వనాథ్ వివరాలను వెల్లడించారు. వీరి వద్ద నుంచి 507 గ్రాముల బంగారు ఆభరణాలు, ఒకటిన్నర కిలో వెండి, రూ. 60వేల నగదు, రూ.4 లక్షలు విలువ చేసే కారు, నేరాలకు ఉపయోగించిన మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని ఎస్‌పి చెప్పారు. ఎర్రగుంట్ల, ముద్దనూరు, ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, మైదుకూరు, బద్వేలు, పోరుమామిళ్ల, కలసపాడు, పులివెందుల, తాడిపత్రి, మద్దిమడుగు, విజయవాడ ప్రాంతాల్లో ఈ ముఠా బ్యాగ్‌లిఫ్టింగ్‌కు పాల్పడిందన్నారు. నేరస్తులు దొంగలించిన బంగారంలో కొంత భాగాన్ని తమ ప్రాంతాల్లో పరిచయాల ద్వారా అమ్మడం, తాకట్టు పెట్టడం చేసేవారని తెలిపారు. మిగిలిన బంగారాన్ని తమ వద్ద దాచుకున్నారని, . ఈ క్రమంలో నేరస్తులు దొంగలించిన బంగారంలో కొంత భాగం రాజమండ్రిలో జెట్టి జువెలర్స్ షాప్‌లో తాకట్టు పెట్టారని వివరించారు. విచారణలో సదరు బంగారాన్ని స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. ఈ ముఠాపై ఉన్న 23 కేసులు ఛేదించామని తెలిపారు. పది సంవత్సరాలలో గుంటూరు, శ్రీకాకుళం, నెల్లూరు, నంద్యాల, తూర్పుగోదావరి, కాకినాడ, బిఆర్ అంబేద్కర్ కోనసీమ, ప్రకాశం, రాజమహేంద్రవరం, అనంతపురం, తదితర జిల్లాల్లో అనేక కేసులు నమోదయ్యాయన్నారు. తూర్పుగోదావరి జిల్లాకు చెందిన తొండా పోసమ్మ, తొండా పోతురాజు, రవుల లక్ష్మి అలియాస్ అంబటి సీత, పులివెందుల పట్టణానికి చెందిన కవీటి అరుణ, పిఠాపురం మండలానికి చెందిన పాల శ్రీకాంత్, పాల సుమతి,పాల వంశీ, ఏలేశ్వరానికి చెందిన నాగళ్ల శివకుమార్, చేబ్రోలు మండలానికి చెందిన పాల ప్రేమ్ కుమార్‌ను అరెస్ట్ చేశామన్నారు. జిల్లాలో జరుగుతున్న బ్యాగ్ లిఫ్టింగ్ ఘటనలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసిన జమ్మలమడుగు పోలీసులు జిల్లాలో బస్సులు, ఆటోలలో ప్రయాణికులకు చెందిన విలువైన వస్తువులు, డబ్బులు దొంగతనంపై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ప్రత్యేక నిఘా వేశారన్నారు. జమ్మలమడుగు డిఎస్‌పి పర్యవేక్షణలో ఎర్రగుంట్ల సిఐ విశ్వనాథరెడ్డి, ఎస్ఐ నాగమురళి వారి సిబ్బంది వచ్చిన సమాచారం మేరకు సోమవారం ఎర్రగుంట్ల మండలం ముద్దనూరు కడప మెయిన్ రోడ్డు వలసపల్లె క్రాస్ వద్ద వీరిని అదుపులోకి తీసుకున్నారన్నారు. ఈ సందర్భంగా ఎస్‌పి పోలీసు బృందాలకు రివార్డులు అందజేసి అభినందించారు.

నిందితులను అదుపులోకి తీసుకుని వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌పి విశ్వనాథ్

కోదండరామాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలు

ప్రజాశక్తి- ఒంటిమిట్ట

ఒంటిమిట్ట శ్రీ కోదండ రామాలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. మంగళవారం తెల్లవారు జాము నుంచి యాత్రికులు ఆలయానికి విచ్చేశారు. క్యూలైన్‌లో నిల్చుని స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్తర ద్వారం ద్వారా యాత్రికులను దర్శన సౌకర్యం కల్పించారు. యాత్రికుల తాకిడిని దృష్టిఒ ఉంచుకుని పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని ఎస్‌పి షెల్కే సచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షించి ఒంటిమిట్ట సిఐ నరసింహరాజుకు పలు సూచనలు చేశారు. తూర్పు, దక్షిణ ద్వారం వద్ద భద్రతా ఏర్పాట్లు పరిశీలించి మహిళలు, వృద్దులు, వికలాంగులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారి దర్శనం చేసుకునేలా చూడాలని సూచించారు. సి.సి కెమెరాల గురించి ఆరా తీశారు. పనితీరును అడిగి తెలుసుకున్నారు. పార్కింగ్, విఐపి పార్కి ంగ్‌లను పరిశీలించారు కార్యక్రమంలో స్పెషల్ బ్రాంచ్ సిఐ యు.సదాశివయ్య, రిమ్స్ పిఎస్ సిఐ రామకృష్ణారెడ్డి, సిద్దవటం ఎస్ఐ మహమ్మద్ రఫీ, రిమ్స్ పిఎస్ ఎస్ఐ సుభాష్ చంద్రబోస్, సిబ్బంది పాల్గొన్నారు. **కలసపాడు :** తిరుమలగిరి (కాలువ కట్ట) క్షేత్రంలో వైకుంఠ ఏకాదశి సందర్భంగా శ్రీ లక్ష్మీదేవి గోదాదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వర స్వామిని ఎపి స్టేట్ రాష్ట్ర రోడ్డు రవాణా డైరెక్టర్ సాధనకారి రంతు దంపతులు ఉత్తర ద్వారం దర్శిచుకున్నారు. ప్రధాన అర్చకులు వారిని ఆశీర్వదించడం తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మోటపోతుల తిరిపేలయ్య, కమిటీ అధ్యక్షులు చాటకొండు సత్యనారాయణ, యాత్రికులు పాల్గొన్నారు.

రామాలయంలో తెలంగాణ హైకోర్టు జడ్జి శ్రీదేవి

పంటల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ అనుమతులు జారీ : డిఆర్ఒ

ప్రజాశక్తి - కడప : రైతులు పండించిన పంటల కొనుగోలుకు రిజిస్ట్రేషన్ అనుమతులు జారీ చేశామని డిఆర్ఒ విశ్వేశ్వర నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు.ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వ నాఫెడ్/ ఎన్‌సిసిఎఫ్ ఆధ్వర్యంలో ఎపి మార్క్ ఫెడ్ వైఎస్ఆర్ జిల్లాలో కందులు, మినుములు పండించిన, ఈ - క్రాప్ చేయించుకున్న రైతుల నుంచి ప్రభుత్వం కందులు ఒక క్వింటాల్ రూ.8వేలు, మినుములు ఒక క్వింటాల్ రూ. 7800 మద్దతు ధర పై కొనుగోలు చేసేందుకు అనుమతి ఇచ్చామని తెలిపారు. ఈనెల 31 నుంచి సిఎం ఎపిపిలో రిజిస్ట్రేషన్‌కు అనుమతులు ఇచ్చామన్నారు. కందులు, మినుములు పండించిన రైతులు, రైతు సేవా కేంద్రంలో తమ పేర్లను నమోదు చేయించుకోవాలన్నారు. జిల్లాలో త్వరలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేశామని తెలిపారు. రైతు సోదరులు తమ పంటను ఇంటి దగ్గరే శుభ్రం చేసుకొని కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు. కేవలం ఈ - క్రాప్ నందు నమోదు చేసుకున్న రైతుల నుండి మాత్రమే కొనుగోలు చేస్తామని పేర్కొన్నారు. తేమ 12 శాతం లోపల ఉండేలా చూసుకోవాలని పేర్కొన్నారు. రైతులు వారి పంటను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవాలన్నారు. అవకాశాన్ని జిల్లాలో కందులు, మినుములు పంట పండించిన ప్రతి రైతూ సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

ఈ ఏడాది తగ్గిన నేరాల సంఖ్య : ఎస్‌పి

ప్రజాశక్తి- కడప అర్బన్ : వైఎస్ఆర్ కడప జిల్లాలో ఈ ఏడాది 2025లో నేరాల సంఖ్య గణనీయంగా తగ్గిందని, పోలీసులు సమిష్టిగా పని చేయడం వల్ల ఇది సాధ్యమైందని ఎస్‌పి నిత్యకేత్ విశ్వనాథ్ పేర్కొన్నారు. 2026లో మెరుగైన పోలీసింగ్‌తో ప్రజలకు ఉత్తమైన సేవలు అందిస్తామని తెలిపారు. 2024తో పోల్చుకుంటే 2025లో అన్నిరకాల నేరాలు తగ్గాయని చెప్పారు. మంగళవారం కడప పెన్నార్ మీటింగ్ హాల్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ ఏడాది నేరనివేదికను వెళ్ళండించారు. పోలీస్ శాఖలో సమర్ధవంతమైన సిబ్బంది పనితీరు, మెరుగైన పోలీసింగ్‌తో హత్యా నేరాలు 9 శాతం తగ్గాయని చెప్పారు. జిల్లాలో పోలీస్ నిఘా, చర్యలతో ఫ్యాక్షన్ కనుమరుగైందని పేర్కొన్నారు. దొమ్మీ నేరాలు 33 శాతం తగ్గాయని తెలిపారు. వైట్ కాలర్ నేరాల్లో 16 శాతం, హత్యా ప్రయత్న నేరాల్లో 9 శాతం, తీవ్ర శరీర ఘాత నేరాల్లో 41 శాతం తగ్గుదల నమోదయింద న్నారు. ఎస్‌సి, ఎస్‌టి కేసులు గత ఏడాదితో పోల్చితే 9 శాతం, మహిళా అపహరణ నేరాలలో 33 శాతం, వరకట్న మరణాలలో 67 శాతం తగ్గిందని తెలిపారు. సైబర్ నేరాలలో 57 కేసులు నమోదు చేసి 33 కేసులు ఛేదించి రూ.3.05 కోట్లు రికవరీ/ఫ్రీజ్ చేశామన్నారు. డిజిటల్ అరెస్టు మోసాలపై ప్రజలకు పోలీస్ శాఖ విస్తృత అవగాహన కల్పించిందన్నారు. 458 గ్యాంబ్లింగ్, 240 మట్కా, 40 క్రికెట్ బెట్టింగ్, 29 కోడిపందేల కేసులు నమోదు చేశామన్నారు. ఈ కేసుల్లో 3.473 మంది అరెస్టు చేసి రూ. 1,65,57,268 స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. 374 అక్రమ మద్యం కేసులు నమోదు, 423 మందిని అరెస్టు చేసి 1450 లీటర్ల మద్యం స్వాధీనం చేసుకున్నని తెలిపారు. మిస్సింగ్ కేసుల్లో పోలీస్ శాఖ 90 శాతం పైగా గుర్తించి వారి కుటుంబ సభ్యుల చెంతకు చేర్చామని తేఎర్కొన్నారు. 22 గంజాయి కేసులు నమోదు చేసి 67 మందిని అరెస్టు చేసి 56 కిలోలకు పైగా గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలోని నలుగురు కరడుగట్టిన నేరస్తులపై పిడి యాక్ట్ ప్రయోగించామని, జిల్లాలోని వివిధ పోలీస్ స్టేషన్ల పరిధిలోని 11 కేసుల్లోని ముద్దాయిలకు జీవితఖైదు, 3 కేసుల్లో 10 సంవత్సరాలకు పైగా జైలు శిక్ష విధించారని పేర్కొన్నారు.

సిఐటియు మహాసభలను జయప్రదం చేయండి

- పోరుమామిళ్లలో బైక్ ర్యాలీ

ప్రజాశక్తి-పోరుమామిళ్ల

ఈనెల 31 నుంచి విశాఖపట్నంలో ప్రారంభమయ్యే సిఐటియు 18వ అఖిలభారత మహాసభలను జయప్రదం చేయాలంటూ పట్టణంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీ అంబేద్కర్ విగ్రహం నుంచి పోలీసు స్టేషన్ వరకు సాగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్. .భైరవ ప్రసాద్ మాట్లాడుతూ సెంట్రల్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ సిఐటియు 18 అఖిలభారత మహాసభలు 2026 జనవరి 4 వరకు నిర్వహిస్తారని చెప్పారు. సిఐటియు ఏర్పడిన తర్వాత మొట్టమొదటిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో నిర్వహించడం మన రాష్ట్రానికే గర్వకారణమని చెప్పారు. స్వాతంత్రోద్యమ వారసత్వంలో పుట్టిన కార్మిక వర్గ ఆశయాన్ని అంకితమైన సంఘం సిఐటియు అని వారన్నారు మహాసభలలో భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తారని తెలిపారు. జనవరి 4న నిర్వహించే సిఐటియు అఖిలభారత మహాసభల మహా ర్యాలీలో కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు సుందరయ్య రత్నం, గురవయ్య, రాజు, రవి, వెంకటసుబ్బయ్య, సాయి, రత్నం, మాలాద్రి మహబూబ్ పేరా, రత్నం పాల్గొన్నారు.

స్కూటర్ ర్యాలీలో సిఐటియు నాయకులు

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం పోరాటం

- కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి.శ్రీనివాసులురెడ్డి

నిరసన తెలియజేస్తున్న బ్యాంకు ఉద్యోగులు

ప్రజాశక్తి - కడప

తమ న్యాయమైన డిమాండ్లను సాధించుకునేంతవరకు పోరాటం సాగిస్తామని కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి. శ్రీనివాసులు రెడ్డి హెచ్చరించారు. మంగళవారం సాయంత్రం కడప జిల్లా యునైటెడ్ ఫోరం ఆఫ్ బ్యాంక్ యూనియన్ల ఆధ్వర్యంలో యుఎఫ్‌బియు పిలుపు మేరకు కడప నగరంలోని ఏడు రోడ్ల కూడలి సర్కిల్‌లో ఉన్న కెనరా బ్యాంక్ మెయిన్ బ్రాంచ్ వద్ద బ్యాంకు ఉద్యోగులు నిరసన కార్యక్రమం చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదించారు. ఈ సందర్భంగా కడప జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ కార్యదర్శి సి శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ 12వ వేతన సవరణ ఒప్పందంలో భాగంగా బ్యాంకులకు 5 రోజుల పని దినాలు అమలుకు 2024 మార్చి నుండి కేంద్ర ప్రభుత్వం అడ్డంకిగా మారిందన్నారు. వేతన సవరణ అంగీకరించి అమలుకు ముందుకు రాని ఈ కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా అన్ని జిల్లా, రాష్ట్ర కేంద్రాల్లో బ్యాంకు ఉద్యోగులందరూ ధర్నా నిరసన కార్యక్రమాలు చేపట్టారని చెప్పారు. పర్ఫామెన్స్ లింక్డ్ ఇంటెన్సివ్(పి ఎల్ ఐ) కూడా బ్యాంకు ఉద్యోగులకు పెండింగ్ పెట్టారన్నారు. కేంద్ర ప్రభుత్వం నవంబర్ 21న నూతన లేబర్ కోడ్స్‌ను కూడా కార్మిక వర్గానికి నష్టపరిచే విధంగా ఉన్నాయన్నారు. బ్యాంకు కార్మిక సంఘాలన్నీ కూడా ఒకే తాటికి పైకి వచ్చి బ్యాంకు ఉద్యోగులకు వ్యతిరేకంగా ఉన్న బ్యాంకు విధానాలను ముక్తకంఠంతో వ్యతిరేకిస్తున్నాయన్నారు. నిరసన కార్యక్రమంలో జిల్లా బ్యాంకు ఉద్యోగుల సమన్వయ కమిటీ అధ్యక్షులు దస్తగిరి, యు ఐ సి ఈ అధ్యక్షులు అజీజ్, అనిల్ కుమార్ రెడ్డి, నారాయణరెడ్డి, ఎస్‌బిఐ యూనియన్ నాయకులు నరేంద్ర, సంజీవ, రామ సుబ్బారెడ్డి, ఏఐబిఓఏ నాయకులు గరుడయ్య, యూనియన్ నాయకులు, ఉద్యోగులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమయాన్ని హరించవద్దు

ప్రజాశక్తి - కడప అర్బన్

విద్యాశాఖలో ఉపాధ్యాయులకు యాప్స్ ఎక్కువగా పెడుతూ వారి సమయాన్ని హరించవద్దని బహుజన టీచర్స్ యూనియన్ (బిటియు) ఎపి రాష్ట్ర అధ్యక్షులు మేకల శివార్జున కోరారు. మంగళవారం యూనియన్ కార్యాలయంలో ముఖ్య నాయకుల సమావేశం నిర్వహించారు. చక్రాయపేట మండల కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాశాఖలో ఉపాధ్యాయులకు యాప్స్ ఎక్కువగా పెడుతూ ఉపాధ్యాయులు విద్యార్థులకు చదువు చెప్పే సమయాన్ని హరించి వేయడం బాధాకరమన్నారు. ప్రాథమిక స్థాయిలో పాఠ్యాంశాలను చెప్పడంలోను, మాతృభాషలో ఎల్ ఎస్ ఆర్ డబ్ల్యు, గణితంలో చతుర్విధ ప్రక్రియలను విద్యార్థులకు నేర్పించడంలోనూ ఉపాధ్యాయులకు స్వేచ్ఛనివ్వాలని పేర్కొన్నారు. తాము చెప్పినట్లే చదువు చెప్పాలని ప్రభుత్వం అనడం ఉపాధ్యాయులలోని సృజనాత్మక శక్తిని దెబ్బతీయటమే అని పేర్కొన్నారు. 10వ తరగతికి స్లిప్ టెస్టులు పెట్టి, వరుసటి రోజు మార్కులను ఆన్‌లైన్ చేయాలనడం ఉపాధ్యాయులను ఒత్తిడిలోకి నెట్టడమేనని చెప్పారు. సెలవు రోజుల్లో కూడా పాఠశాలకు వెళ్లి పదవ తరగతి విద్యార్థులకు తరగతులు తీసుకోవాలని అనడంతో మహిళా ఉపాధ్యాయులు చాలా బాధలు పడుతున్నారన్నారు. ఉపాధ్యాయులందరూ ప్రజ్ఞాపరంగా ఒకేలా ఉండరని, వారిలో ఉన్న అంతర్గత నైపుణ్యాల మేరకు విద్యార్థులకు బోధన చేస్తారని పేర్కొన్నారు. అలా చేస్తేనే విద్యార్థులు చదువులో స్వేచ్ఛగా రాణిస్తారని, చదువు చెప్పడంలో ఉపాధ్యాయులకు స్వేచ్ఛను ఇవ్వాలని అన్నారు. **చక్రాయపేట మండల కమిటీ ఎన్నిక..** మండలాధ్యక్షునిగా వి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శిగా టి.వి.సి. మనోహర్, కోశాధికారిగా పి.మురళిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షులు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం, విద్యాభివృద్ధి కోసం శక్తి వంచన లేకుండా కృషి చేస్తామని పేర్కొన్నారు. సమావేశంలో రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సి.సుదర్శన్ బాబు, జిల్లా అధ్యక్షులు ఎం.గంగరాజు, కార్యనిర్వాహక సభ్యులు కె. జయరాముడు, టి.మనోహర్ పి.మురళి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మేకల శివార్జున

మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవి

అభివృద్ధి, సంక్షేమం దిశగా పాలన : ఎమ్మెల్యే

ప్రజాశక్తి- కడప అర్బన్ : కూటమి ప్రభుత్వం రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం దిశగా పాలన సాగిస్తుందని ప్రభుత్వ విప్, కడప ఎమ్మెల్యే మాధవి పేర్కొన్నారు. ద్వారకా నగర్‌లోని ఆమె నివాసంలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ శాశ్వతంగా కడప తాగునీటి సమస్యను పరిష్కరించే దిశగా రూ.800 కోట్లతో బ్రహ్మ సాగర్ నుంచి నీటిని తీసుకువచ్చే పనులు ప్రారంభం అవుతుందన్నారు. పెన్నా నుంచి కడపకు నీరు సరఫరా అవుతుందని, వినియోగించిన వృధా మురుగునీరు తిరిగి పెన్నాలో కలుస్తుందని, నీటి కాలుష్యం కాకుండా మురుగునీటిని శుద్ధి చేసి, నదిలో వదిలే ప్రయత్నం చేస్తున్నామని పేర్కొ న్నారు. బుగ్గ వంక శుద్ధి చేయడంతో దోమలు తగ్గాయని తెలిపారు. అత్యంత ప్రాధాన్యత పనులను పూర్తి చేస్తామన్నారు. కడపను నేరాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరం చేసేందుకు సిసి కెమెరాలు ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు. కెమెరాల కొనుగోలుకు కావాలసిన ధనాన్ని, ధనికుల నుంచి చందాల రూపంలో వసూలు చేస్తామన్నారు. గంజాయి ముఠాను ప్రోత్సహించే వారు ఎన్ని అపోహలు సృష్టించిన, కడప పూర్తిస్థాయిలో సిసి కెమెరాల పర్యవేక్షణలో ఉండే విధంగా చేస్తానని ఆమె చెప్పారు. సమావేశంలో టిడిపి నగర అధ్యక్షులు మన్సూర్ అలీఖాన్, టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు తిరుమలేష్ పాల్గొన్నారు.

రవి యాదవ్‌కు సన్మానం

ప్రజాశక్తి - కడప : కూటమి ప్రభుత్వంలో నూతన సమాచార హక్కు చట్టం కమిషనర్‌గా కడప నగరానికి చెందిన సీనియర్ న్యాయవాది రవి యాదవ్‌ను మంగళవారం న్యాయవాదులు ఆయన గృహంలో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో న్యాయవాదులు మాచిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, డాక్టర్ డి.కె.రమణ, సురేష్, శావలయ్య, పరిమళ, నాగేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత : జడ్జి

ప్రజాశక్తి - కడప

పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరికీపై ఉందని సీనియర్ సివిల్ జడ్జి ఎస్.బాబా ఫక్రుద్దీన్ అన్నారు. మంగళవారం జిల్లా కోర్టులోని న్యాయ సేవా సదన్ లో భారతదేశవ్యాప్తంగా పర్యా వరణ చట్టపరమైన అక్షరాస్యత, సమాజ రక్షణ చొరవ 'ఈరోజు రక్షించు, రేపు సురక్షితం' మొదలగు అంశాలపై న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ ఘన వ్యర్థాలను సరిగ్గా పారవేయకపోవడం అపరిశుభ్రమైన పరిస్థితులను సృష్టిస్తుంది అన్నారు. ఈ పరిస్థితులు పర్యావరణాన్ని కలుషితం చేస్తాయని తెలిపారు. వెక్టర్ ద్వారా సంక్రమించే వ్యాధుల వ్యాప్తికి దారితీస్తాయని తెలిపారు. పొడి చెత్త, తడి చెత్త, తాగునీరు, ఘన వ్యర్థాల నిర్వహణ కోసం ప్రభుత్వం వేస్ట్ టు వెల్త్ పోర్టల్, స్వచ్ఛ సర్వేక్షణ్ నిర్వహన, చెత్త రహిత నగరాల యొక్క స్టార్ రేటింగ్, ప్లాస్టిక్ వ్యర్థాల నిర్వహణ నియమాలు 2016, ఘన వ్యర్థ పదార్థాల నిర్వహణ నియమాలు 2016 నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా వివిధ చట్టాల గురించి జడ్జి వివరించారు. కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి డి. విశ్వేశ్వర నాయుడు, రెవెన్యూ డివిజనల్ ఆఫీసర్ జాన్ ఇర్విన్, వైఎస్ఆర్ కడప జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ అజరతయ్య, అన్నమయ్య జిల్లా చీఫ్ ప్లానింగ్ ఆఫీసర్ వెంకట పెద్దయ్య, డిస్టిక్ ఇండస్ట్రియల్ జనరల్ మేనేజర్ చాంద్ బాషా, అన్నమయ్య జిల్లా అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొన్నారు.

బేకరిలో శాంపిల్స్ సేకరిస్తున్న ఫుడ్ కంట్రోలర్

బేకరీల్లో హానికర రసాయనాలు వాడితే చర్యలు

- జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్.రామచందర్

ప్రజాశక్తి - కడప

నూతన సంవత్సరాన్ని పురస్కరించుకొని వినియోగదారులను ఆకర్షించేలా బేకరీల్లో తయారు చేసే కేకులలో హానికర రసాయనాలు, రంగులు వాడొద్దని జిల్లా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ ఎస్. రామచందర్ హెచ్చరించారు. మంగళవారం నగరంలోని పలు హోటళ్లు, బేకరీలను కడప ఆహార భద్రత అధికారి డాక్టర్ ఎం. హరిత, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ రమేష్ తో కలిసి ఆయన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు పట్టణంలో ప్రముఖ హోటళ్లు, బేకరీలలో తనిఖీలు నిర్వహించి వారికి నోటీసులు ఇచ్చారు. ఆయా శాంపుల్స్ తీసి ఆహార పరిశోధన కేంద్రానికి పంపారు. పరిశుభ్రత లేనటువంటి వాటికి చలానాలు కట్టించారు. పరిశోధన నిమిత్తం కేక్, స్వీట్స్ శాంపుల్స్‌ను ఆహార ప్రయోగశాల లాబరేటరీకి పంపించారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ మాట్లాడుతూ నూతన సంవత్సర వేడుకల దృష్ట్యా వినియోగదారులను అమితంగా ఆకట్టుకునే అధిక లాభాలు పొందాలన్న ఆలోచనా రీతిలో బేకరీల నిర్వాహకులు ఎవరైనా రసాయనాలు, రంగులు వాడినట్లయితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. స్వీట్ల తయారీలో వ్యాపారులు జాగ్రత్త వహించి స్వచ్ఛమైన నూనె, ఆహార పదార్థాలను వినియోగించి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత వ్యాపారులపై ఉందని సూచించారు.

లైఫ్ సర్టిఫికెట్‌ను 'జీవన్ ప్రమాణ్' పోర్టల్ ద్వారా సమర్పించాలి

ప్రజాశక్తి - కడప : ప్రభుత్వ ఫ్యామిలీ పెన్షనర్లు 2028 జనవరి 01 నుండి ఫిబ్రవరి 28 వరకు తమ లైఫ్ సర్టిఫికేట్‌ను డిజిటల్ విధానంలో 'జీవన్ ప్రమాణ్' పోర్టల్ ద్వారా సమర్పించాల్సి ఉంటుందని జిల్లా ఖజానా అధికారి ఎం. వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైఫ్ సర్టిఫికెట్ సమర్పించేందుకు ఆధార్ కార్డు, మొబైల్ ఫోను (ఓటిపి కోసం), పిపిఒ నంబర్ (పెన్షన్ పుస్తకం), బ్యాంక్ పాస్ బుక్ వివరాలతో సమీపంలోని సబ్ ట్రెజరీ కార్యాలయంలో కానీ, మీసేవా కేంద్రంలో కానీ ఇంటర్నెట్ సదుపాయం ఉన్నచోట కానీ, పెన్షనర్ల సంఘం వద్ద కానీ తమ వివరాలు అందించి లైఫ్ సర్టిఫికెట్ నమోదు చేయించుకోవలెనని జిల్లా ఖజానా అధికారి తెలిపారు.

బాధిత కుటుంబానికి బీమా చెక్కు అందజేత

ప్రజాశక్తి - వల్లూరు

రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన బుచ్చుపల్లి భాస్కర్‌రెడ్డి భార్య చేన్న కుమారికి ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ చైతన్య మంగళవారం రూ. 2 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ వల్లూరు మండలం పుల్లారెడ్డిపేట గ్రామానికి చెందిన భాస్కర్‌రెడ్డి ఇటీవల కడప ఎయిర్‌పోర్టు దగ్గర జరిగిన రోడ్డు ప్రమాదంలో చనిపోయారని తెలిపారు. మృతుడు కమలాపురంలోని ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంక్ క్రాస్ రోడ్ బ్రాంచ్‌లో ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన ప్రమాద బీమా ప్రీమియం కట్టారని, ఈనేపథ్యంలో వారి కుటుంబానికి సామాజిక , ఆర్థిక భద్రత కలిగిందని తెలిపారు. బ్యాంకు ఖాతాదారులు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన పథకాల ద్వారా సామాజిక ఆర్థిక భద్రత కలిగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విసిఎఫ్ఎల్ కౌన్సిలర్ ఓబులేసు, ధనుంజయులు బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.


చెక్కును అందజేస్తున్న బ్యాంకు మేనేజర్

విద్యార్థికి సర్టిఫికెట్ అందిస్తున్న ప్రిన్సిపల్ ఎస్.నాగేంద్ర

జాతీయ సమైక్యత శిబిరానికి డిగ్రీ విద్యార్థి ఎంపిక

ప్రజాశక్తి - వేంపల్లె

కేంద్ర యువజన సర్వీసుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైన జాతీయ సమైక్యత శిబిరానికి వైఎస్ఆర్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి లక్ష్మీనరసింహ ఎంపికయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. మంగళవారం విద్యార్థి లక్ష్మీనరసింహను కళాశాల అధ్యాపకులు అభినందించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ జాతీయ సమైక్యత శిబిరం హైదరాబాద్‌లోని ఎంఎల్ఆర్ టెక్నాలజీ విద్యాలయంలో జరిగిందన్నారు. శిబిరంలో సామాజిక, పర్యావరణ అంశాలతోపాటు సామాజిక బాధ్యత ఆవశ్యకతపై సమాజంలో అవగాహన కల్పించాలని చెప్పారు. విద్యార్థిని అభినందించిన వారిలో ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ ఎం.ఓబుల్‌రెడ్డి, డాక్టర్ సి.మల్లేశ్వరమ్మ పాల్గొన్నారు.

గ్రామసభ అనంతరం ర్యాలీ నిర్వహిస్తున్న తహశీల్దార్, అధికారులు

రీ సర్వేను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు మండలంలోని మిట్టమానుపల్లె రెవెన్యూ పరిధిలో జనవరి 2 నుంచి ప్రభుత్వం చేపట్టనున్న భూముల రీ సర్వే కార్యక్రమంపై మంగళవారం తహశీల్దార్ రాజసింహా నరేంద్ర రైతులకు అవగాహన కల్పించారు. భూముల రీ సర్వేకు సంబంధించి ప్రభుత్వం విడుదల చేసిన కరపత్రాలను పంపిణీ చేశారు. రీ సర్వే వివరాలను సచివాలయ నోటీస్ బోర్డులో ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏపీ ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రీ సర్వే నిర్వహిస్తోందన్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. భూ సర్వే నిర్వహించి ప్రభుత్వమే గుర్తు రాళ్లను ఏర్పాటు చేస్తుందని, సర్వే సిబ్బందికి రైతులు సహకరించాలని తహశీల్దార్ సూచించారు. కార్యక్రమంలో రీ సర్వే డిటి ప్రవీణ్, విఆర్ఓ ఓబుల్ రెడ్డి, సచివాలయ సర్వేయర్లు, వీఆర్ఏలు, రైతులు పాల్గొన్నారు.

చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దయనీయం

ప్రజాశక్తి - వేంపల్లె

చంద్రబాబు పాలనలో రైతుల పరిస్థితి దయనీయంగా ఉందని పిసిసి అధికార ప్రతినిధి తులసిరెడ్డి పేర్కొన్నారు. వేంపల్లెలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ 2025 సంవత్సరంలో చంద్రబాబు నేతృత్వంలో కూటమి ప్రభుత్వం అన్ని రంగాల్లో విఫలమైందని విమర్శించారు. రైతులు పండించిన ఏ పంటకూ గిట్టుబాటు ధర లభించలేదన్నారు. ఎరువుల ధరలు విపరీతంగా పెరిగాయన్నారు. యూరియా కొరతతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారని తెలిపారు. పంటల బీమా అమలు కాలేదన్నారు. పంట నష్ట పరిహారం అందలేదని విమర్శించారు. విద్యుత్ ఛార్జీలు పెంచి వీర బాదుడు బాదారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం పాలనలో డ్రగ్స్, గంజాయి దుష్ట సంస్కృతి పాఠశాలల్లో కూడా ప్రవేశించిందని ఆందోళన వ్యక్తం చేశారు.

శిబిరంలో వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

ఉచిత ఆరోగ్య సంరక్షణ శిబిరం విజయవంతం

ప్రజాశక్తి - ప్రొద్దుటూరు(పుట్టపర్తి సర్కిల్)

ప్రొద్దుటూరు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ఆవరణలో మంగళవారం కళాశాల ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తిరెడ్డి ఆధ్వర్యంలో కెసి పుల్లయ్య ఫౌండేషన్ సహకారంతో ఉచిత ఆరోగ్య సంరక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఆరోగ్య శిబిరంలో విద్యార్థులు, కళాశాల సిబ్బందికి రక్తపోటు, మధుమేహం వంటి పరీక్షలు నిర్వహించారు. పరీక్షల సమయంలో కొన్ని అసాధారణ ఆరోగ్య పరిస్థితులు గుర్తించిన వ్యక్తులను మరింత చికిత్స నిమిత్తం సమీపంలోని ప్రభుత్వ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. అవసరమైన వారికి ఉచిత మందులు కూడా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ పాలెం గురుమూర్తి రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్యంగా ఉంటేనే విద్యా ప్రగతి సాధ్యమవుతుందన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై కళాశాల యాజమాన్యం ఎప్పటికప్పుడు ప్రత్యేకశ్రద్ధ చూపుతుందన్నారు. ఇలాంటి ఆరోగ్య శిబిరాలు భవిష్యత్తులో కూడా నిర్వహిస్తామని తెలిపారు. ఇందుకు సహకరించిన కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రతినిధులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సాయిప్రసాద్, కెసి పుల్లయ్య ఫౌండేషన్ ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ గురుబ్రహ్మయ్య, ఆరోగ్య సిబ్బంది, సివిల్ ఇంజినీరింగ్ విభాగం సీనియర్ లెక్చరర్ రవికుమార్, లెక్చరర్ నరేంద్ర, విద్యార్థులు, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

జగన్ ఆర్థిక నేరస్తుడు కాబట్టే పొత్తుల్లేవు

ప్రజాశక్తి -ప్రొద్దుటూరు (పుట్టపర్తి సర్కిల్)

వైఎస్ జగన్ ఆర్థిక నేరస్తుడు కాబట్టే దేశంలో ఏ పార్టీ వైసిపితో పొత్తు పెట్టుకోదని జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి వై.ఎస్.జబీవుల్లా తెలిపారు. స్థానిక టిడిపి కార్యాలయంలో మంగళవారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ సోమవారం కడపలో ప్రొద్దుటూరు మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి విలేఖరుల సమావేశంలో మాట్లాడుతూ.. వైసిపి మాత్రమే దేశంలో ఏ పార్టీతో పొత్తు పెట్టుకోదని గొప్పగా చెప్పారన్నారు. వాస్తవానికి మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి ఆర్థిక నేరస్తుడన్నారు. ఈ కారణంతా ఆ పార్టీతో ఎవరూ పొత్తు పెట్టుకోలేదని విమర్శించారు. ప్రొద్దుటూరులో మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి జగనన్న ఇళ్లు, మార్కెట్, సోములవారిపల్లె బ్రిడ్జి ఇలా ఏ ఒక్కటీ పూర్తి చేయలేదని, అందుకే ప్రజలు ఆయనను ఓడించారన్నారు. వైసిపి పాలనలో టిడిపి వారిపై అక్రమ కేసులు బనాయించారని ఆరోపించారు. కార్యక్రమంలో కడప జిల్లా టిడిపి కార్యదర్శి తలారి పుల్లయ్య, అధికార ప్రతినిధి ఘంటసాల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జబీవుల్లా

శాస్త్రీయ పద్ధతులతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - వేముల

శాస్త్రీయ వ్యవసాయ పద్ధతులతో తక్కువ పెట్టుబడి, అధిక దిగుబడి సాధించవచ్చని జెడి బి.చంద్రనాయక్ సూచించారు. వేముల రైతు సేవాకేంద్రంలో మంగళవారం వేరుశనగ సాగు చేసే రైతులకు పంటల యాజమాన్య పద్ధతులు, అధిక దిగుబడులు సాధించేందుకు ఎఒ ఓబులేస్ ఆధ్వర్యంలో శిక్షణనిచ్చారు. ముఖ్యఅతిథులుగా జిల్లా వ్యవసాయ సంయుక్త సంచాలకులు బి.చంద్రనాయక్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా వేరుశనగ మినీ కిట్లు పొందిన రైతులు తప్పనిసరిగా వేరుశనగ పంట సాగు చేయాలన్నారు. ప్రతి రైతు ఇ-పంట నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని సూచించారు. అందుకు అనుగుణంగా భవిష్యత్తులో రాబోయే వివిధ రకాల సదుపాయాలు, అవకాశాలు పొందవచ్చని ఆయన వివరించారు. కెవికె శాస్త్రవేత్త మహేష్‌కుమార్ మాట్లాడుతూ పంట విత్తిన సమయం నుంచి కోసే వరకు వివిధ రకాల పురుగులు, తెగుళ్ల నివారణకు సస్యరక్షణ పద్ధతులను రైతులకు క్లుప్తంగా వివరించారు. పులివెందుల వ్యవసాయ సహాయ సంచాలకులు ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ రైతులు తప్పనిసరిగా శాస్త్రవేత్తలు సూచనలు పాటించి అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి సీనియర్ నాయకుడు పేర్ల శేషారెడ్డి, రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది, అగ్రికల్చర్ అసిస్టెంట్ నియాజుల్లా, ఏఈఓ సురేష్, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు.

రైతులకు సూచనలిస్తున్న జెడి బి.చంద్రనాయక్

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ శ్రీధర్ నాయుడు

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

ప్రజల నుంచి అధికారుల దృష్టికి వచ్చిన సమస్యలపై వెంటనే స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలని ఎంపీడీఓ శ్రీధర్ నాయుడు కోరారు. మైదుకూరు మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి థామస్ అధ్యక్షతన మంగళవారం మండల సభా భవనంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల్లోని సమస్యల పట్ల ప్రజాప్రతినిధులకు అవగాహన ఉంటుందన్నారు. వారు సమస్యలను సభ దృష్టికి తెస్తే సంబంధిత అధికారులు స్పందిస్తారన్నారు. ప్రజాప్రతినిధుల నుంచి సభ దృష్టికి వచ్చిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆర్అండ్‌బి రోడ్ల వెంబడి కంపచెట్లు అధికంగా పెరిగి ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారని వెంటనే తొలగించాలని అన్నలూరు సర్పంచ్ శ్రీనివాసులరెడ్డి, వనిపెంట నుంచి లెక్కలవారిపల్లెకు వెళ్లే మార్గంలో అధిక లోడుతో వెలుతున్న రోడ్డు దెబ్బతిని ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారని సర్పంచ్ జయభారత్ రెడ్డి సభలో పేర్కొన్నారు. ఎఇ రామకృష్ణారెడ్డి స్పందిస్తూ నిధులు మంజూరు కాగానే బాగు చేస్తామన్నారు. ఇ-క్రాప్ నమోదు చేసుకున్న ఉల్లి పంట సాగు చేసిన రైతులకు ఎకరాకు రూ.20 వేలు నష్టపరిహారం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని, త్వరలోనే రైతుల ఖాతాలో జమ అవుతుందని ఉద్యానశాఖ ఎఇ రామకృష్ణ తెలిపారు. కెసి కెనాల్ ఎఇ గురుమోహన్ రెడ్డి మాట్లాడుతూ రబీ సీజన్‌లో ఆరుతడి పంటలు మాత్రమే సాగు చేసుకోవాలన్నారు. కెసి కెనాల్‌కు సంబంధించిన సమస్యలు ఏవైనా ఉంటే ఫిబ్రవరి తర్వాత వాటిని గుర్తించి వేసవిలో పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో జడ్పిటిసి ప్రసన్న లక్ష్మి, పిఆర్ ఎఇ నిరంజన్ రెడ్డి, ఎంఇఒ పద్మలత, కెసి కెనాల్ ఎఇ గురుమోహన్‌రెడ్డి, ఆర్డబ్ల్యూఎస్ ఎఇ భరత్, వ్యవసాయ అధికారి బాలగంగాధర్‌రెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

నూతన సంవత్సర వేడుకలకు పటిష్ట భద్రత : డిఎస్‌పి

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

నూతన సంవత్సర వేడుకలు ప్రశాంతంగా నిర్వహించుకునేందుకు పోలీసు పటిష్ట భద్రత ఏర్పాటు చేసినట్లు మైదుకూరు డిఎస్‌పి జి.రాజేంద్రప్రసాద్, అర్బన్ సిఐ రమణారెడ్డి తెలిపారు. వేడుకలను నిర్వహించుకునే వారు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రమాదాలకు దూరంగా ఉంటూ పిల్లలు, పెద్దలు అందరూ వారి ఇళ్లలో వేడుకలు జరుపుకోవాలని సూచించారు. పోలీసుల సూచనలు పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులకు గురిచేసే విధంగా బహిరంగ ప్రదేశాల్లో నూతన సంవత్సర వేడుకలను నిర్వహిస్తే వారిపై తగు చర్యలు తీసుకుంటామని వారు హెచ్చరించారు. నూతన సంవత్సర వేడుకలను గురువారం రాత్రి 12:30 గంటలలోపు ముగించాలన్నారు. తర్వాత కొనసాగిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దన్నారు. టపాసులు, డీజే నిషేధమన్నారు. మద్యం మత్తులో వాహనాలు నడపడం నేరమన్నారు. రహదారులు బ్లాక్ చేసి వేడుకలు చేయవద్దన్నారు. మహిళల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

హక్కులకు భంగం కలిగిస్తే సమాచారం ఇవ్వండి

పులివెందుల టౌన్ : ఎస్‌సి, ఎస్‌టి హక్కులకు భంగం కలిగిస్తే సమాచారం ఇవ్వాలని పట్టణ సీఐ సీతారామరెడ్డి సూచించారు. సివిల్స్ రైట్ డే సందర్భంగా మంగళవారం పట్టణ పరిధిలోని బొగ్గుడుపల్లె గ్రామంలో ఎస్‌సి, ఎస్ టిల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్, రెవెన్యూ సహకారాలు ఎల్లవేళలా అందిస్తామన్నారు. డిప్యూటీ తహశీల్దార్ వెంకటరెడ్డి, ఆర్ఐ షేక్షావల్లి, విఆర్‌ఓ బాబు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న పట్టణ సీఐ సీతారామిరెడ్డి

రోడ్లపై వేడుకలు నిషేధం : సిఐ

ప్రజాశక్తి-కలికిరి

2026 నూతన సంవత్సర వేడుకలు అర్ధరాత్రి రోడ్ల పై జరుపుకోవడం పూర్తిగా నిషేధమని కలికిరి సిఐ కె.రామచంద్ర తెలిపినారు. డిసెంబర్ 31వ తేది రాత్రి 10 గంటల్లోపు వేడుకలు పూర్తి కావాలని, రోడ్ల పై కేకులు కట్ చేసి వేడుకలు జరుపుకునేందుకు అనుమతి లేదన్నారు. మద్యం తాగి పబ్లిక్ ప్లేస్ లలో గలాటాలకు పాల్పడి, ఆకతాయి చేష్టలు చేసి ప్రజలకు ఇబ్బంది కలిగించకూడదని, డిసెంబర్ 31వ తేది రాత్రి డ్రంక్ డ్రైవ్ గురించి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి, మద్యం తాగి వాహనాలు నడిపే వారి పై కేసులు నమోదు చేస్తామని, మైనర్ల వాహనాలు నడిపితే, వారి పై మరియు వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అశ్లీల నృత్యాలు, చేష్టలు నిషేధం పై నియమాలు ఖచ్చితంగా పాటించి, ప్రశాంతంగా వేడుకలు జరుపుకొని పోలీస్ వారికి సహకరించాలని, మండల ప్రజలకు ఆయన నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. **రామాపురం :** నూతన సంవత్సర వేడుకల్లో అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ శివకుమార్ హెచ్చరించారు. డిసెంబర్ 31 రాత్రి మద్యం సేవించి వాహనాలు నడపడం అల్లర్లు సృష్టించడం లాంటి చర్యలకు పాల్పడితే చట్టం ప్రకారం కఠిన చర్యలు తప్పవన్నారు. యువత అత్యుత్సాహంతో ప్రమాదాల బారిన పడకుండ తల్లిదండ్రులు తమ పిల్లలను రాత్రి వేళలో బయటకు పోతున్నారు మహిళల రక్షణ కోసం ప్రత్యేక పోలీసు బృందాలు నిరంతరం గస్తీ ముమ్మురం చేసినట్లు తెలిపారు.

అన్నదానం గొప్పది : ఎంపిపి

ప్రజాశక్తి-వీరబల్లి

అన్నదానం గొప్పదని ఎంపిపిల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వంగిమళ్ల పంచాయతీ కావలిగడ్డ విశ్వనాథరెడ్డి కుటుంబ సభ్యులు, డి.రాచపల్లి, పంచాయతీ పెద్ద మాదిగ పల్లెకు చెందిన మూసగాళ్ల ఆంజనేయులు కుటుంబ సభ్యులు కలిసి ముక్కోటి ఏకాదశి సందర్భంగా పెద్దమాదిగపల్లెలో ఆంజనేయస్వామి ఆలయం విద్యుత్ దీపాలతో అలంకరించారు. మండల వ్యాప్తంగా వైభవంగా ముక్కోటి ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. రెండు గ్రామాల ప్రజలకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. అనంతరం పెద్దమాదిగపల్లి యువకులకు క్రికెట్ కిట్ అందజేశారు.

గురు ప్రసాద్‌కు అవార్డుపై హర్షం

ప్రజాశక్తి-మదనపల్లె టౌన్

రాష్ట్రవ్యాప్తంగా విద్యాభివృద్ధికి విశేషంగా దోహదపడుతున్న ముగ్గురు విద్యావేత్తలకు ప్రముఖ ఐసిటి అకాడమీ సంస్థ 'ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డులు' అందజేసింది. ఈ అవార్డుల్లో రెండు ఇంజినీరింగ్ కళాశాలలకు దక్కగా, రాష్ట్రవ్యాప్తంగా ఒకే ఒక్క డిగ్రీ కళాశాలకు ఈ గౌరవం లభించడం విశేషం. మదనపల్లెకు చెందిన శ్రీ జ్ఞానాంబిక డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ రాటకొండ గురు ప్రసాద్‌కు 'ఎడ్యుకేషన్ చేంజ్ మేకర్ అవార్డు' లభించింది. విజయవాడలోని నోవాటెల్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో రాష్ట్ర హయ్యర్ ఎడ్యుకేషన్ కౌన్సిల్ చైర్మన్ ప్రొఫెసర్ మధు మూర్తి, జెఎన్‌టియు కాకినాడ వైస్ ఛాన్సలర్ సిఎస్ఆర్‌కె ప్రసాద్, ఐసిటి అకాడమీ సిఇఒ వి. శ్రీకాంత్ చేతుల మీదుగా గురు ప్రసాద్ అవార్డు స్వీకరించారు.

'మిట్స్'లో క్వాలిటీ మైండ్‌సెట్ వర్క్‌షాప్

ప్రజాశక్తి -మదనపల్లె టౌన్

మదనపల్లి సమీపంలోని మిట్స్ డీమ్డ్ యూనివర్సిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజినీరింగ్ విభాగం ఆధ్వర్యంలో మిట్స్ ఇన్‌స్టిట్యూషన్ ఆఫ్ ఇంజనీర్స్ ఇండియా (ఐఇఐ) స్టూడెంట్ చాప్టర్ సహకారంతో 'క్వాలిటీ మైండ్‌సెట్ అండ్ టెస్ట్ ఆటోమేషన్' అనే అంశంపై రెండు రోజుల పాటు హాండ్స్ఆన్ వర్క్‌షాప్‌ను నిర్వహించారని కాలేజీ వైస్ ఛాన్సలర్ డాక్టర్ యువరాజ్ తెలియచేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ ముఖ్య అతిథిగా చెన్నైకి చెందిన సిజిఐ ఇన్‌కార్పొరేషన్ కంపెనీ కన్సల్టింగ్ డెలివరీ మేనేజర్ వినోత్ కుమార్ బోజరాజ పాల్గొన్నారన్నారు. ఈ సందర్భంగా వినోత్‌కుమార్ బోజరాజ మాట్లాడుతూ ప్రతి సాఫ్ట్‌వేర్ అభివృద్ధి దశలో ముందుగానే నాణ్యతపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. డెవలపర్స్, టెస్టర్స్, బిజినెస్ అనలిస్ట్ సమన్వయంతో పనిచేస్తే ఉత్తమ నాణ్యత గల ఫలితాలు సాధ్యమవుతాయని తెలిపారు. సాఫ్ట్‌వేర్ అభివృద్ధి ప్రారంభ దశ నుంచే క్వాలిటీ మైండ్‌సెట్‌ను పాటించడం ద్వారా లోపాలు తలెత్తకుండా ముందుగానే నివారించవచ్చని, దీనివల్ల వినియోగదారులకు నమ్మకమైన, సురక్షితమైన మరియు స్థిరమైన సాఫ్ట్‌వేర్‌ను అందించవచ్చని వివరించారు. చివరి దశలో మాత్రమే టెస్టింగ్ చేయకుండా ప్రతి డెవలప్‌మెంట్ దశలో నాణ్యతను కాపాడితే సమయం, ఖర్చు రెండూ తగ్గుతాయని పేర్కొన్నారు.

విధి నిర్వహణలో ఎన్నో ప్రశంసలు సంతృప్తినిచ్చాయి

- ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పాముల మురహరిరెడ్డి

ప్రజాశక్తి - కడప అర్బన్

పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్‌లో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా విధులు నిర్వహిస్తున్న తనకు అధికారులను ఎన్నో ప్రశంసలు సంతృప్తినిచ్చాయని పాముల మురహరిరెడ్డి పేర్కొన్నారు. విధి నిర్వహణలో వివిధ హోదాలో పని చేస్తూ అధికారుల నుంచి అనేక ప్రశంసా పత్రాలు అందుకున్నారు. ఈ నెల 31న ఉద్యోగ విరమణ చేయు సందర్భంగా ఆయన ప్రజాశక్తితో మాట్లాడారు. జమ్మలమడుగు నియోజకవర్గంలో 1963 సంవత్సరంలో పి.బాలమునిరెడ్డి, పి.బాల ప్రభావతమ్మ దంపతులకు జన్మించానని పేర్కొన్నారు. విద్యాభ్యాసం 1 నుంచి 6వ తరగతి వరకు నంద్యాల జిల్లా ఆళ్లగడ్డలో ఉన్న పాలసారం స్కూల్‌లో కొనసాగిందని తెలిపారు. 7 నుంచి 9 వరకు జడ్‌పి స్కూల్ రాజంపేటలో విద్యను అభ్యసించానని చెప్పారు. 10 నుంచి ఇంటర్మీడియట్ వరకు ప్రభుత్వ జూనియర్ కళాశాల పులివెందులలో అభ్యసించానని పేర్కొన్నారు. బి.టెక్ కెఎస్ఆర్ఎం ఇంజినీరింగ్ కళాశాలలో పూర్తి చేశానని తెలిపారు. ఎం.టెక్ ఎస్.వి.యూనివర్శిటీ, తిరుపతిలో పూర్తి చేశానని చెప్పారు. 1990 సంవత్సరం ఎంప్లాయిమెంట్ ద్వారా ఆర్ అండ్‌బిలో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా ఉద్యోగం చేరానని పేర్కొన్నారు. అక్కడ 2 సంవత్సరాలు పని చేశానని తెలిపారు. 1992లో పబ్లిక్ సర్వీస్ కమిషన్ పరీక్ష రాసి అదే ఏడాది ఆళ్లగడ్డలోని పంచాయతీరాజ్‌లో అసిస్టెంట్ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా చేరానని చెప్పారు. రుద్రవరం మండలంలో 2004 వరకు పని చేశానని పేర్కొన్నారు. పదోన్నతి పొంది డిప్యూటేషన్‌పై కడప రాజీవ్ విద్యామిషన్‌లో డిప్యూటీ ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా కడపలో పని చేశానని తెలిపారు. ఇక్కడ 2014 వరకు పని చేశానని చెప్పారు. బదిలీపై పంచాయతీ రాజ్‌కు డిప్యూటీ ఎగ్జిక్యూట్ ఇంజినీర్‌గా పిఐయు డివిజన్ పోరు మామిళ్లలో 2019 వరకు పని చేశానని పేర్కొన్నారు. బదిలీపై పిఎ టూ ఇఇ పిఆర్ఐ డివిజన్‌లో 2023 వరకు విధులు నిర్వహించి మళ్లీ రాజీవ్ విద్యామిషన్‌లో ఎగ్జిక్యూటీవ్ ఇంజినీర్‌గా 2024 వరకు పని చేశానని చెప్పారు. జూన్ నుంచి 2025 డిసెంబర్ 31 వరకు పంచాయతీరాజ్ క్వాలిటీ కంట్రోల్‌లో పని చేస్తూ ఉద్యోగ విరమణ చేయనున్నట్లు పేర్కొన్నారు. 35 సంవత్సరాల 6 నెలల తన సర్వీస్ కాలంలో డిప్యూటేషన్‌పై పని చేసి రాజీవ్ విద్యామిషన్‌లో అనేక పాఠశాలలు నిర్మించానని గుర్తించి 20 ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు తెలిపారు. పంచాయతీరాజ్‌లో 10 ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు చెప్పారు. మొత్తం 30 ప్రశంపాత్రాలు అందుకోవడం సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు. అధికారులు, ఉద్యోగుల సహకారం మరువలేనిదని తెలిపారు.

ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణలో నాయకులు

ఘనంగా ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - జమ్మలమడుగు

ఎస్ఎఫ్ఐ 56వ ఆవిర్భావ దినోత్సవాన్ని ఆ యూనియన్ జిల్లా సహాయ కార్యదర్శి హరిబాబు ఆధ్వర్యంలో మంగళవారం పట్టణంలోని అన్నా క్యాంటీన్ ఎదురుగా ఉన్న ఎస్ఎఫ్ఐ స్థూపం వద్ద జెండా ముఖ్యఅతిథిగా ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా సహాయ కార్యదర్శి వినయ్‌కుమార్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ అధ్యయనం-పోరాటం, చదువు పోరాడు-చదువుకై పోరాడు అనే నినాదంతో స్వాతంత్రం, ప్రజాస్వామ్యం, సోషలిజం ఆశయ సాధనకు 1970లో కేరళ రాష్ట్రం తిరువనంతపురంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భవించిందన్నారు. పాఠశాల స్థాయిలోని విద్యార్థులకు క్రికెట్ పోటీలను నిర్వహించామన్నారు. నాటి నుండి నేటి వరకు విద్యారంగంలో వస్తున్న విద్యార్థి వ్యతిరేక విధానాలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతోందన్నారు. అందరికి విద్య.. అందరికి ఉపాధి లక్ష్యం కోసం, పేద బడుగు బలహీన వర్గ విద్యార్థుల బాగు కోసం పోరాటాలు చేసిందన్నారు. కార్యక్రమంలో జమ్మలమడుగు ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షులు ఖాదర్, సహాయ కార్యదర్శులు చరణ్, దస్తగిరి, మధుబాబు, పవన్, దస్తగిరి, మనోజ్, నరేంద్ర పాల్గొన్నారు.

బి.మఠంలో..

బ్రహ్మంగారిమఠం : మండల కేంద్రంలోని బాలుర ఉన్నత పాఠశాలలో భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) మండల కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా నాయకులు ఎద్దు రాహుల్ ఘనంగా నిర్వహించారు. ఈర సందర్భంగా జెండా ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు అజయ్, అరవింద్, రాజశేఖర్, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్యాటరీ స్ప్రేయర్లు పంపిణీ చేస్తున్న అధికారులు

ఆదాయాన్నిచ్చే మిల్లెట్ సాగు

ప్రజాశక్తి - పులివెందుల టౌన్

మిల్లెట్ సాగు రైతులకు ఆదాయాన్నిస్తుందని వ్యవసాయ కళాశాల డీన్ రామారావు తెలిపారు. స్థానిక ఉద్యాన కళాశాలలో మంగళవారం ఎస్‌సి రైతులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సమగ్ర పోషక నిర్వహణ, సేంద్రియ సాగు పద్ధతులను వివరించారు. జీవ ఎరువులు, జీవ ఆధారిత ఇన్‌పుట్‌ల వినియోగం ద్వారా నేల ఆరోగ్యం మెరుగుపడి, రసాయన ఎరువులపై ఆధారపడడం తగ్గుతుందన్నారు. ఆహార భద్రత పెరుగుతుందన్నారు. హార్టీ మిల్లెట్ ప్రాజెక్టు ద్వారా రైతులకు బ్యాటరీ స్ప్రేయర్లు ఉచితంగా పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని డాక్టర్ శరత్‌కుమార్ రెడ్డి, డాక్టర్ నాగలక్ష్మి, కార్యాలయ సూపరింటెండెంట్, ఎపి కోస్ సిబ్బంది సమన్వయంతో సమర్థవంతంగా నిర్వహించారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమంలో ఎఒ రమేష్

పంట నమోదు తప్పనిసరి

ప్రజాశక్తి - లింగాల

రబీలో సాగు చేసిన ప్రతి పంటను ఆన్‌లైన్ నమోదు తప్పనిసరిగా చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి రమేష్ సూచించారు. మండల పరిధిలోని వెలిదండ్ల రైతు సేవా కేంద్రంలో మంగళవారం ఇ-పంట నమోదు కార్యక్రమాన్ని రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. నమోదులో ఎలాంటి అవకతవకలు జరగకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. సకాలంలో పంట నమోదు పూర్తి చేయాలన్నారు. పంట నమోదు వల్ల రైతులకు మేలు జరుగుతుందన్నారు. ప్రకృతి వైపరీత్యాలతో పంట నష్టం సంభవిస్తే ప్రభుత్వ పథకాలు ఆదుకుంటాయన్నారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ప్రతి రైతు తమ పొలంలో సాగు చేసిన పంటను నమోదు చేయించుకోవాలని ఆయన సూచించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతు సేవా సిబ్బంది జగదీశ్వరరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా ముక్కోటి ఏకాదశి

ప్రజాశక్తి - వేంపల్లె

వేంపల్లి మండల వ్యాప్తంగా పలు ఆలయాల్లో ముక్కోటి ఏకాదశి వేడుకలు మంగళవారం వైభవంగా నిర్వహించారు. వేంపల్లి నాలుగు రోడ్ల కూడలిలో వెలసిన వెంకటేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు తిరుమల వేణు నేతృత్వంలో స్వామివారిని పత్తితో అలంకరించారు. వృషభాచలేశ్వర స్వామి ఆలయంలో అర్చకులు హరిప్రవీణ్ నేతృత్వంలో స్వామివారిని వజ్ర కవచ గోవిందుడుగా అలంకరించారు. సూర్యోదయానికి ముందే స్వామివారికి సుప్రభాత సేవ, ఆరాధన, తిరుప్పావై కైంకర్యాలు వంటివి నిర్వహించారు. భక్తులకు ఉత్తర ద్వారం ద్వారా దర్శనం కల్పించారు. స్థానిక కన్యకా పరమేశ్వరిని పురవీధుల గుండా ఊరేగించారు. ఎలాంటి అసౌకర్యం కలగకుండా పోలీసులు బందోబస్తు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఆర్కేవ్యాలీ ట్రిపుల్‌ఐటి ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు సేవలందించారు.

9 నుంచి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నమెంట్

ప్రజాశక్తి - చాపాడు (మైదుకూరు)

మైదుకూరు శ్రీలక్ష్మీ మాధవరాయస్వామి సంక్రాంతి వేడుకల సందర్భంగా ఎంసిసి ఆధ్వర్యంలో జిల్లాస్థాయి హార్ట్ టెన్నిస్ బాల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహిస్తున్నారు. ఆసక్తిగల క్రీడాకారులు జనవరి 7లోపు తమ టీంను ఎంట్రీ ఫీజుతో నమోదు చేసుకోవాల్సిందిగా నిర్వాహకులు సూచించారు. వివరాలకు 98850 53115, 98850 68818 నంబర్లను సంప్రదించాలని కోరారు.